ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

రుణాల మంజూరుకు పాడి రైతుల వినతి

ప్రజాశక్తి -అనంతగిరి:రాష్ట్ర ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని సోమవారం మండల కేంద్రం లోని పశు వైద్య శాఖ కార్యాలయంలో పాడి రైతులు వినతి పత్రం అందజేశారు. అనంతగిరి, పెద్దకోట, కీవర్ల పంచాయితీ కుడియా, నక్కలమామిడి, పూతికపుట్టు, బొడ్డపుట్టు గ్రామాల చెందిన రైతులు అనంతగిరి, కాశీపట్నం పశువైద్యాధికారులు .సందీప్, గణేశ్వరరావు లను కలిసి లిఖిత పూర్వకంగా విన్నవించారు. పశు పోషణ, ఇతర కిసాన్ క్రెడిట్ కార్డ్, పిఎంజిఈవై రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రాంబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న పాడి రైతులు

అర్ధాంతరంగా తొలగింపు అన్యాయం

-తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి -మహిళా సెక్యూరిటీ గార్డుల నిరసన

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకులం, ఏకలవ్య పాఠశాలు కళాశాలల్లో పనిచేస్తున్న ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డులు అర్ధాంతరంగా తమ తొలగింపును వ్యతిరేకిస్తూ సోమవారం ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డుల సంఘం, ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తమను కొనసాగింపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దీనిపై చేపట్టిన రిలే దీక్షలు విరమించారు. టెండర్ మారిందనే నెపంతో తన అనుచరులు, కార్యకర్తల సంబంధించిన సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవడం కోసం పాడేరు ఎమ్మెల్యే ప్రోత్బలంతో ఇప్పటివరకు పని చేసిన తమను అర్ధాంతరంగా తొలగించడానికి పూనుకున్నారని మహిళా సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.సుందర్రావు ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డుల సంఘం అధ్యక్షులు గంపరాయి సీతమ్మ మాట్లాడుతూ, 2022 ఆగస్టు 15 తేదీ నుండి సేవా సుప్రీమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా గురుకులం ఏకలవ్య పాఠశాలలు కళాశాలల్లో సెక్యూరిటీ గార్డులుగా నియమించబడి విధులు నిర్వహిస్తున్న ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డులను టెండర్ కాంట్రాక్ట్ మారిందనే కారణంతో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు విధుల్లోనుంచి తొలగించడం అన్యాయమన్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తన కార్యకర్తలకు నియమిస్తూ టెండర్ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఇప్పటివరకు పనిచేస్తున్న ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్లను కడుపు కొట్టి అన్యాయం చేయడం తగదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ జోక్యం చేసుకొని మహిళ సెక్యూరిటీ గార్డులను న్యాయం చేయాలని లేనిపక్షంలో విజయవాడ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎండా, వాన, రాత్రి పగలు క్రమశిక్షణతో డ్యూటీ చేశారని వీరి పొట్టలు కొట్టవద్దని కోరారు. ఏకపక్షంగా తన కార్యకర్తలు, అనుచరులను నియమిస్తామని బాహాటంగా ప్రకటించడం అన్యాయమన్నారు. గత పది రోజులు నుండి ఐటీడీఏ ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ కనీసం మహిళలని కూడా చూడలేదన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి తేల్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులు ఎస్ కస్తూరి, ప్రశాంతి, బి.రాజమ్మ, గెమ్మెలి మంగమ్మ, పి.సావిత్రి, పి.నాగమణి, ఎం.సింహాచలం, ఎం.గంగా భవాని, జి నాగమణి, సిహెచ్ జ్యోతి, పి.లక్ష్మి, ఎన్.జ్యోతి, వి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, మహిళా సెక్యూరిటీ గార్డులు

లోయలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

- ఇంటర్ విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి -సీలేరు

జికే వీధి మండలం దారాలమ్మ ఘాట్ రోడ్లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి లోయలో పడిన ఘటనలో ఇంటర్ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీకి చెందిన ఆగూరి మౌనిక (17) బూసిమాని వీధికి చెందిన మురళి బుజ్జిబాబు ఇద్దరు ద్విచక్ర వాహనంపై దారాలమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఘాట్‌రోడ్డులో ప్రమాద మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి 20 అడుగుల లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మౌనిక తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న బుజ్జి బాబు తలకు తీవ్ర గాయాలు కాగా, దారకొండ పిహెచ్సికి తరలించి వైద్య సేవలు అందించారు. మృతి చెందిన మౌనిక ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.


సంఘటనా స్థలంలో మౌనిక మృతదేహం, ద్విచక్ర వాహనం

చింతూరు ఐటిడిఏ ఎదుట ధర్నా చేస్తున్న మధుగూరు గ్రామస్తులు

బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని కల్లేరు నుండి మధుగూరు గ్రామం వరకు బీటీ రోడ్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గ్రామస్తులు సోమవారం చింతూరు ఐటీడిఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు మాట్లాడుతూ ప్రధానంగా తమ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని, మరమ్మతులు చేయించాలని, స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో ఆసుపత్రికి వెళ్లాలన్నా నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గుంపులకు కరెంట్ స్తంభాలు కూడా లేవని, తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఏ పిఓ చైతన్యకు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన పివో మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, స్థానిక సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధుగూరు గ్రామస్తులు కారం బాబురావు, పండ నారాయణ, పాండు సుబ్బారావు, ఓగ్గల సీతారామయ్య, జోడే జోగారావు, కారం వినోద్, సోయం రాజులు, మొట్ట బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మహిళల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ముంచింగి పుట్టులో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని మండల అధ్యక్షులు ఎస్.ఈశ్వరి, మండల కార్యదర్శి ఎస్.విజయల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు ప్రత్యేక చట్టాలు, హక్కులు కల్పించాలన్నారు. మహిళల స్వేచ్ఛను కాపాడాలన్నారు. మహిళల రిజర్వేషన్‌కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు.ఐక్యరాజ్యసమితి ప్రకటించిన మానవుల హక్కుల ఉల్లంఘం దినాన్ని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మహిళల హక్కుల, చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని మహిళలకు పిలుపునిచ్చారు. నేటి మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ నైపుణ్యత కలిగి ఉన్నారని గుర్తు చేశారు. స్వతంత్ర సమరయోధులతో పాటుగా ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, కరణం మల్లేశ్వరి వంటి శక్తివంతమైన మహిళలు ఉన్నారని కొనియాడారు.అనంతరం గిరిజన మహిళ సంఘం మండల అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ, మండల పరిధిలో నాటు సారా క్రయవిక్రయాలు జరుగుతున్నామని తెలిపారు.పోలీస్ శాఖ ఈ విషయంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిపిఎం నాయకులు లైకోన్, మహిళా సంఘం కమిటీ నెంబర్స్ వసుధ, మీనా, రాధమ్మ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, నాయకులు

నీటిని పడుతున్న మహిళలు

పోరాటంతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:ఆదివాసీ గిరిజన సంఘం పోరాట ఫలితంగా మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ చెప్పారు. ఆ గ్రామంలో మరమ్మతుకు గురైన తాగునీటి పథకం మోటార్‌ను సంబంధిత అధికారులు చేపట్టి సోమవారం తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి పథకం మోటార్ మరమ్మతు చేయాలని గతంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద పలుమార్లు ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. స్పందించిన అధికారులు గ్రామంలో తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహెచ్ రమేష్, మహదేవ్, టీ.దను, పాపారావు, టి.కుమారి, టి.పూర్ణిమ, వంజన పాల్గొన్నారు.

బ్యాంకులో బారులు తీరిన నిరుద్యోగులు

నిరుద్యోగులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: జిల్లా వైద్య ఆరోగ్య కళాశాల, ఆసుపత్రి ఉద్యోగాలకు బ్యాంక్‌లో డీడీలు పొందేందుకు గడువు ఒక్కరోజే ఉండటంతో సోమవారం మండల కేంద్రంలో ఉన్న యూనియన్ బ్యాంక్ వద్ద నిరుద్యోగులు బారులు తీరారు. బ్యాంకు సేవల్లో తీవ్రమైన జాప్యంతో డీడీ లు కొంతమందికి మరుసటి రోజుకు ఇస్తున్నారు. మరుసటి రోజు బ్యాంక్‌కి వస్తే డీడీలు లేవని సిబ్బంది చెపుతున్నారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.గట్టిగా అడిగితే నెట్ వర్క్ లేదని చెపుతున్నారని విమర్శించారు.

22న ఎఒబి బంద్

ప్రజాశక్తి -జి.మాడుగుల : ఈనెల 22 భారత్ బంద్'లో భాగంగా ఏఓబీలో బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టు ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శ గణేష్ పేరిట స్థానిక విలేకరులకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు.ఈ నెల 16 నుండి 22 వరకు దేశవ్యాప్తంగా ప్రచార, ఆందోళనలు చేపడతామని, '22న భారత్ బందు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

14, 15 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

-ఎడిఎంహెచ్ఓ తీరు గర్హనీయం
-ఎపి ఆశా వర్కర్స్ సమావేశంలో సిఐటియు జిల్లా నేత వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 14, 15 తేదీలలో జరిగే 36 గంటల మహాధర్నాను జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ పిలుపునిచ్చారు. రంపచోడవరం సీఐటీయూ కార్యాలయంలో కలింకోట రమణమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా వారిచేత వెట్టి చాకరీ చేయిస్తుందన్నారు. ఈ సమస్యల పరిస్కారానికై ఈ నెల 14, 15 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్స్ యూనియన్ 36 గంటల మహా ధర్నా చేపడుతుందని చెప్పారు. ఈ ధర్నా విషయమై సమాచారం నిమిత్తం వినతి ఇవ్వడానికి సోమవారం ఎడిఎంహెచ్ఓ కార్యాలయానికి యూనియన్ నేతలు వెళ్లగా గంటైనా లోనికి రానివ్వకుండా ఎడిఎంహెచ్ఓ వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పట్టని అధికారులను ఏజెన్సీ ప్రాంతాల్లో నియమించి ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటున్నారని, దీని వల్ల గిరిజనుల ఆరోగ్యం కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారుల మొండి వైఖరిని తిప్పి కొట్టాలంటే 14, 15 తేదీలలో జరిగే మహా ధర్నాకు ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాణిశ్రీ, ఆశా కార్యకర్తలు,

చెడిపోయిన మోటారు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న జీడిగుప్ప గ్రామస్తులు

మరమ్మతులకు గురైన మోటారును పరిశీలిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల జీడిగుప్ప గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం గోదావరిలో ఏర్పాటు చేసిన మోటారు మరమ్మతులకు గురైంది. దానిని బాగు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో తాగునీటి కోసం జీడిగుప్ప గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జీడిగుప్ప గ్రామంలో 80 కుటుంబాల వారు నివసిస్తున్నారు. గోదావరి నుండి జీడిజీప్ప గ్రామానికి విద్యుత్ మోటార్ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఆ మోటార్ ఇప్పుడు చెడిపోయి మూలన పడిపోవడంతో తాగునీరు రావడం లేదు. గ్రామంలో ఒక చేతి పంపు ఉండగా, అది కూడా సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో మంచినీటి నీటి కోసం గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. మోటారును బాగు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు రాకపోవడంతో గ్రామస్తులు గోదావరిలోకి దిగి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. గోదావరి కాఫర్ డ్యామ్ కారణంగా నీరు నిల్వ వలన రేవులోకి దిగి నీళ్ళు తెచ్చుకోవాలంటే నరకం చూస్తున్నామని వారు వాపోతున్నారు. తమకు గోదావరి నీరే ఆధారమని, ఇన్ని బాధలు పడుతున్నా, పదే పదే అధికారులకు చెప్పినా స్పందించకపోవడం దారుణమని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేసి, తాగునీరు అందించాలని కోరుతున్నారు.

తక్షణమే మోటారుకు మరమ్మతులు చేయాలి

మోటారు చెడిపోవడంతో నీళ్ల కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం మోటార్‌ను వినియోగంలోకి తెచ్చి నీళ్ళు ఇవ్వాలి.

- కె.ఖాదరుబాబు, జీడిగుప్ప గ్రామం

నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం

పొద్దంతా పనులు చేసి అలసి పోయిన మాకు గోదావరి ఒడ్డు దిగి నీటిని తేవాలంటే అనేక ఇబ్బందులు పెడుతున్నాం. రేవు మొత్తం బురద పట్టి దిగబడుతుంది. కాపర్ డ్యామ్ కారణంగా నది నీరు మారిపోయింది. వెంటనే అధికారులూ పరిశీలించి మోటార్‌కు మరమ్మతులు చేసి నీళ్ళు ఇవ్వండి.

- ఆదిలక్ష్మి, జీడిగుప్ప గ్రామం

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నేతలు, రైతులు

కరువు మండలంగా ప్రకటించాలని ధర్నా

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతుల వ్యవసాయ రుణాలు తక్షణమే మాఫీ చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన సోమవారం జికె.వీధి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి ముందు జీకే వీధి పెట్రోల్ బంక్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షా భావం వల్ల పంటలు పండలేదని, అడపాదడపా పండిన వరి, రాజ్మా, మినప, చోడి తదితర పంటలకు ఇటీవల మీచౌంగ్ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం వాటిలిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాలు రద్దు చేసి కొత్త రుణాలను రైతులకు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, జనసేన నాయకులు రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అడ్డతీగల

అనారోగ్యంతో చికిత్స పొందుతూ రెండు నెలల క్రితం మృతి చెందిన మండలంలోని మట్లపాడు గ్రామానికి చెందిన కర్రి నూకరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్సీ అనంత బాబు చేతుల మీదగా సోమవారం అందజేశారు. నూకరాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన నాటి నుండి పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. నూకరాజు మృతితో ఆయన భార్య, ఇద్దరు పిల్లలు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లవరం సొసైటీ అధ్యక్షులు తోట రాజేశ్వరావు, జెసిఎస్ కన్వీనర్ నక్క మోహన్, కారు రాంబాబు, సాయి, సత్తిబాబు పాల్గొన్నారు.

డికెటి పట్టాలు పంపిణీ

మండలంలోని ఎల్లవరం గ్రామంలో అసైన్‌మెంట్ పట్టాలను (డికెటి) సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అనంత బాబు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు తాతారావు, సీనియర్ అసిస్టెంట్ మోహన్, వీఆర్వోలు, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేత పి.శాంత కుమారి

ప్రజాశక్తి -అనంతగిరి:అరకు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రాష్ట్ర ఆదివాసి మహిళా అధ్యక్షురాలు, అరకు నియోజకవర్గ పార్టీ ఇన్ఛార్జి నాయకురాలు పాసిపెంట శాంతకుమారి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు.ఒక్క కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు కె పి కృష్ణ, మండల నాయకులు కృష, కిల్లో ,రామకృష్ణ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు

వాటర్ ట్యాంక్ ఏర్పాటు

ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి హుకుంపేట:- మండలం లోని గన్నేరు పుట్టు హెడ్ క్వార్టర్ లో కొత్త వాటర్ ట్యాంక్ ను సోమవారం ఏర్పాటు చేశారు. సోలార్ వాటర్ ట్యాంకు పగిలి పోవడంతో అధికారుల దృష్టికి గ్రామస్తులు, నాయకులు తెలియజేయడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన ఐటీడీఏ నిధులతో ట్యాంక్ ఏర్పాటు చేశారు. దీంతో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు,డొంకిన వలస సీపీఎం వార్డ్ మెంబర్ మజ్జి రాజారావు, గ్రామ పెద్దలు దూసూరు నాగేశ్వరరావు, దూసూరు కర్రన్న, బోయిన వెంకటేష్ తదితరులు హర్ష వ్యక్తం చేశారు.

గీతం ఎక్సలెన్స్ మీట్కు ఆహ్వానం

వాల్పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రాజా

ప్రజాశక్తి- విశాఖపట్నం :వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ వచ్చేనెల 10, 11 తేదీల్లో గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) -2024 నిర్వహిస్తున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. సోమవారం వాల్పోస్టర్లను ఆహ్వానం కమిటితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెమ్ కన్వీనర్, సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ వివరాలను వెల్లడించారు. విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచే గీతం ఎక్సలెన్స్ మీట్ను 30ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వాణిజ్య అంశాలపై వర్క్షాప్లు, సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చలు, విద్యార్థుల ఫ్యాషన్షో, రాక్బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెమ్-24 నిర్వాహక బృంద సభ్యులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

సమస్యలపై పోరాటం ఉధృతం : సిఐటియు

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు : అంగన్వాడి, ఆశా, సిహెచ్ డబ్ల్యుల సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. సోమవారం పాడేరులో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనప్పటికీ సమస్య పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 15 తేదీల్లో ఆశా వర్కర్లు 36 గంటల కలెక్టరేట్ ఆఫీసుల ముందు మహాధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. పాడేరు ఐటిడిఎ వద్ద సిహెచ్డబ్ల్యులు చేస్తున్న పోరాటం 14, 15 తేదీల్లో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్యదర్శులు. బొండా సన్నిబాబు, గడుతూరి సత్యనారాయణ, కుర్ర శంకర్రావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అవకాశమిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా!

ఎస్సి, ఎస్టి కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం

మాట్లాడుతున్న సివేరి అబ్రహం

ప్రజాశక్తి -అరకులోయరూరల్:అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తమ కుటుంబం ఎంతో సేవలు అందించిందని, తనను అధిష్టానం గుర్తించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తనకు టికెట్ కేటాయించాలని మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం కోరారు. అరకులోయ మండలం కేంద్రంలోని అబ్రహం నివాస గృహం వద్ద ఆ పార్టీ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి అరకు నియోజకవర్గ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి తన తండ్రి మాజీ ఎమ్మెల్యే సోమ ఎంతో కృషి చేసి చివరికి తన ప్రాణాలను సైతం పార్టీకే ఫణంగా పెట్టారని చెప్పారు. సర్పంచ్ నుంచి జెడ్పిటిసి, ఎమ్మెల్యేగా తన తండ్రి పదవులు చేపట్టి పార్టీ కోసం పని చేశారన్నారు.అటువంటిది తమను గుర్తించకుండా అధిష్టానం కొత్తగా పార్టీలో చేరిన వారికి అరకు నియోజకవర్గ ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు.గతంలో కిడారి శ్రావణకుమార్ కు మంత్రి పదవి ఇచ్చి 2019లో ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించారని ప్రస్తుతం అరకు పార్లమెంట్ ఇన్చార్జి కూడా బాధ్యతలు అప్పగించారని చెప్పారు.తన కుటుంబానికి మాత్రం పార్టీ ఎందుకు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.2024 ఎన్నికల్లో తనకు అరకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పోటి చేస్తానని టిడిపి జెండా తప్పకుండా ఎగరవేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు వ్యాలీ టిడిపి మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, మాజీ ఎమ్మెల్యే సోమ సతీమణి ఇచ్చావతి, డుంబ్రిగూడ మాజీ ఎంపిటిసి సుబ్బారావు, టీడీపీ అరకు వేలి సీనియర్ నాయకుడు పొద్దు అమ్మన్న, నాయకులు బాబు శాస్త్రి బాబు, టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సమిష్టిగా పోరాడి హక్కులు సాధించుకుందాం

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

ధనుంజయనాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న బిసి నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం :బిసిలంతా ఐకమత్యంతో హక్కులు సాధించుకొని, చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచుకుందామని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం గంభీరం చందన ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బిసిలంతా ఒకేతాటిపై నడవాలని, రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చి, జనాభా ప్రాతిపదికన బిసిలకు సీట్లు కేటాయింపునకు కృషి చేయడంతోపాటు వారిని గెలిపించడం ద్వారా చట్టసభల్లో బిసిల వాణి వినిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఉత్తరాంధ్రకు వలస నాయకులు వస్తే, వాళ్లను తరిమికొట్టేలా పోరాటం చేయాలనన్నారు. బిసి సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నూతన అధ్యక్షులు కర్రి ధనుంజయనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 90 శాతం బిసిలు ఉన్నారని, దామాషా ప్రకారం సీట్లు కేటాయించేలా రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెద్దామన్నారు. త్వరలో ఉత్తరాంధ్రలో పర్యటించి, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీలను వేయడం ద్వారా యూనియన్ను బలోపేతం చేయడంతోపాటు ఫిబ్రవరి రెండో వారంలో బిసి గర్జనసభకు సమాయత్తం చేద్దామన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాస్నాయుడు, నగర అధ్యక్షులు పల్లా రమణ, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నష్ట పరిహారానికి ఎగనామం

ప్రజాశక్తి-చింతపల్లి:వైసిపి ప్రభుత్వం మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతులకు నష్టపరిహారానికి జారీ చేసిన జీవో 5 చూస్తుంటే రైతులకు ఎగనామం పెట్టడానికేనని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ ఆరోపించారు.సోమవారం చింతపల్లిలో జరిగిన సిపిఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుఫానుతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి జీవో 5 ప్రభుత్వం జారీ చేయడం బూటకంగా ఉందని ఆయన అన్నారు. జీఓ 5 ప్రకారం 33 శాతం పంట నష్టం జరిగి కొట్టుకు పోయి ఉంటేనే పరిహారం వర్తిస్తుందని చెప్పడం ఏమాత్రం సబబు కాదని తెలిపారు. తుఫానుకు ముందు పంట కోసేసి ఉన్నా, అది తడిసినా, మొలకలు వచ్చినా పంట నష్టం వర్తించదని అనడం రైతులకు ప్రభుత్వం మోసం చేయడమేనని విమర్శించారు. జీవో ప్రకారం రైతులకు కనీసం వెయ్యి రూపాయలు కూడా నష్టపరిహారం దక్కేలాగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా పరిహారం ఇవ్వకుండా తప్పించుకునే దొంగ కనిపిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

మాట్లాడుతున్న బత్తిరి రవిప్రసాద్

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ కుమ్మరపుట్టు గ్రామంలో సోమవారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దైవ సేవకులు సిహెచ్ అనిల్ కుమార్.కృప రక్షణ పాల్గొని ఏసుక్రీస్తు దైవ సందేశాన్ని బోధించారు. ప్రేమను పంచడమే నిజమైన క్రిస్మస్ అన్నారు.వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ బత్తిరి రవి ప్రసాద్ మాట్లాడుతూ పాపులకు రక్షించడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి రక్షకుడిగా అవతరించాలని ఆయన కొనియాడారు.సభ అధ్యక్షులు డేవిడ్ పాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెంట్రల్ ఫెలోషిప్ నాయకులు వి బాలకృష్ణ, టీడీపి నాయకులు బొడ్డ శ్యామ్, యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య. ఫెలోషిప్ అధ్యక్షు కార్యదర్శులు మోజెష్, జేమ్స్ గౌరవ అధ్యక్షులు కే ప్రేమ్ కుమార్, సంఘ కాపరి కే.యోహన్, ట్రెజరర్ జాన్ బాబు, సేవకులు రాజారావు, ఫిలిప్, సామియేలు పాల్గొన్నారు.

వైర్లెస్ నెట్వర్క్లపై 'గీతం' ఎఫ్డిపి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వైర్లెస్ నెట్వర్క్లు, భవిష్యత్తులో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్డిపి) నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. 5జి సాంకేతిక పరిజ్ఞానం వంటివి అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో కాలానుగుణ మార్పులను లోతుగా అధ్యయనం చేయాలన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ప్రొఫెసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కన్వీనర్ డాక్టర్ పి.శంకరావు మాట్లాడుతూ ఐదు రోజులు పాటు జరిగే ఎఫ్డిపి శిక్షణ లో భాగంగా అధ్యాపకులకు 4జి, 5జి నెట్ వర్క్ల పై అవగాహన, కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, మెట్ల్యాబ్, లేటెక్స్ పరిజ్ఞానం, మొబైల్ వైర్లెస్ సెన్సార్ నెట్ వర్క్లు, ఎడ్జి కంప్యూటింగ్, స్మార్ట్ సిటీ వంటి అంశాలపై ప్రముఖ ఐఐటిలు, ఎన్ఐటిల నుంచి నిపుణుల హాజరై శిక్షణ ఇస్తామన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి పెంటయ్య

జల్ జీవన్ మిషన్ పనులు పంచాయతీలకు అప్పగించాలి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని 35 గ్రామాలకు మంజూరైన జల్ జీవన్ మిషన్ మంచి నీటిపథకాల నిర్మాణ పనులు గ్రామ పంచాయతీల అధ్వర్యంలో చేపట్టే విధంగా అధికార్లు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్తా శ్రీరామ్మూర్తి భవన్లో సోమవారం జరిగిన సీపీఎం ప్రజా ప్రతినిధుల సమావేశంలో పెంటయ్య మాట్లాడుతూ స్థానిక సర్పంచుల అధికారాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఇవ్వవడం లేదన్నారు. నిధులను పక్కదారి పట్టించి, పేర్లు మార్చి, పథకాల పేరుతో పంచాయతీలను కాదని కమిటీల నియామకం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు కమిటీల నియామక ఆలోచనను విరమించాలని కోరారు. సచివాలయంలో నియమించిన సిబ్బందిని సచివాలయంలోనే పనిచేయించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సర్పంచులు బోగ్గా రామారావు, సోడే శంకర్, మడకం నాగమణి, బి.వెంకమ్మ, ఎంపీటీసీలు కారం జయసుధ, డి.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పిఒతో పాటు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీఓ సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 42 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్ శాస్త్రి, ఏడియంహెచ్ఓ జి.ప్రకాశం, వెలుగు ఎపీడీ ఎ.శ్రీనివాసరావు, డిఎల్పిఓ రాఘవన్, ఏజెన్సీ డిఇఓ మల్లేశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి.యూసఫ్, సుబ్బయ్య, ఎ.రవికుమార్, పిహెచ్ఓ చిట్టిబాబు, ఏడిఏ సిహెచ్కెవి.చౌదరి, డాక్టర్ ఇందిర, సిడిపిఓ సంధ్యారాణి, ఎంపీడీవో హరికృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, మల్లికార్జున రావు, శ్రీనివాసరావు, రామచంద్రమూర్తి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మడకం సావిత్రి, లీగల్ సెల్ న్యాయవాది యన్వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం సమావేశం నిర్వహించారు. మండలంలోని పీడీలు పిఈటీలతో జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ లాలం సీతయ్య, ఎంపీపీ బడుగు రమేష్ పాల్గొని తగు సూచనలు అందించారు. ఎంఇఓ రాంబాబు, ఎపిటిడబ్ల్యుఆర్ఎస్ ప్రిన్సిపల్ మోహన్ పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా 4 కేజీల గంజాయిని పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం వరంగల్కు చెందిన వేల్పుల శ్యామ్, గణిపాక సాయికృష్ణ అనే ఇద్దరు ఒరిస్సా రాష్ట్రం మల్కన్గిరి జిల్లా కిండుగుదా గ్రామంలోని కిలో రామచంద్రరావు వద్ద 4 కేజీల గంజాయిని కొనుగోలు చేసి స్కూటీపై వస్తుండగా, వాహన తనిఖీలు సందర్భంగా పట్టుబడ్డారు. పట్టుబడిన గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చింతూరు ఎస్ఐ డి.శ్రీనివాస్ తెలిపారు.

అధికార పార్టీ చుట్టూ అసమ్మతి ఉచ్చు !

విశాఖలో పలు చోట్ల గ్రూపుల బెడద

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో అధికార వైసిపిపై అసమ్మతివాదులు ఉచ్చు బిగిస్తున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కొక్కటిగా ఇది బయటపడుతోంది. స్థానికంగా పలువురు నాయకులను వైసిపి ఆంతరంగిక విషయాలు, పాలనా వ్యవహారాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మరీ ముఖ్యంగా తెలంగాణ ఎన్నికల తర్వాత ఆంధ్రాలో రాజకీయ పరిస్థితులపై అంతటా చర్చ జరగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్నట్టుగానే సిట్టింగులపై అసంతృప్తులు ఇక్కడా కనిపిస్తున్నాయి. వారే 2024లో నిలబడితే ఓట్లు, సీట్లు రావనే ఆందోళన కొంతమంది సీనియర్ కార్యకర్తలు, పార్టీనే నమ్ముకున్న వారి నుంచి వినిపిస్తున్న మాట. దిగువ శ్రేణుల్లో 2019 ఎన్నికల తర్వాత నుంచీ ఈ అసంతృప్తులు వెన్నంటే ఉన్నాయి. అయినప్పటికీ అధినాయకత్వం నివారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరి గోల వారిదే అన్నట్టుగా మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహారం ఉండడంతో ప్రధాన అనుచరులు, నాయకుల్లో అసమ్మతి పెల్లుబుకుతోంది.

అంతటా అదే వరస

విశాఖ నగరంలోని తూర్పు, దక్షిణం, పశ్చిమం, ఉత్తరం సహా గాజువాక వంటి ప్రధాన అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రూపుల బెడదతో అధికార వైసిపి సతమతమవుతోంది. పలు సర్వేలు కూడా ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను కంగారు పెడుతున్నాయి. గాజువాకలో ఎమ్మెల్యే నాగిరెడ్డి తనయుడు దేవన్రెడ్డి ఆ నియోజకవర్గ ఇన్ఛార్జి పదవికి సోమవారం రాజీనామా చేయడం ఈ కోవలోకే వస్తుంది. పలానా సామాజిక తరగతి వారికి పలానా నియోజకవర్గంలో సీటు ఇస్తేనే గెలుపు గుర్రాలను అందుకోగలరన్న సర్వే నివేదికలతో పలువురు కలవరపాటుకు గురవుతున్నారు. తాజాగా గాజువాక నియోజకవర్గ ఇన్ఛార్జిగా ఉరుకూటి చందును అధిష్టానం ఖాయం చేసినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా విశాఖలో కొత్తగా ఆ పార్టీలోకి వచ్చే వారి కంటే బయటకు పోయే వారి సంఖ్య నానాటికీ అంటే ఎన్నికలు సమీపిస్తున్నప్పటికి పెరగనుందన్నది తెలుస్తోంది. దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్లోనూ ఇదే గ్రూపుల బెడద వైసిపిలో ఉంది. ఇండిపెండెంట్లుగా గెలిచి వైసిపి తీర్థం పుచ్చుకున్న వారంతా ఎన్నికల ముందు ఆ పార్టీకి ఝలక్ ఇచ్చి జనసేన లేదా ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ప్రధానంగా స్థానిక శాసన సభ్యులు వాసుపల్లి గణేష్కుమార్ పట్ల వ్యతిరేకత నాయకుల్లో వ్యక్తమవుతోంది

ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల చెంతకు చేర్చేందుకు వాలంటీరు, సచివాలయల వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. మండలంలోని కొండగోకిరి గ్రామంలో సోమవారం ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో డిస్ప్లే బోర్డును ఏర్పాటు చేశారుర. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జెడ్పిటిసి వార నూకరాజు, వైస్ ఎంపీపీ వెంకటరమణ, జెసిఎస్ కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచులు ముసిలినాయుడు, రీమల శ్రీను, ఎంపిటిసి మల్లేశ్వరి, వైసిపి నాయకులు గాడి సత్తిబాబు, గంగాధర్, సావిత్రి, సరస్వతి, ధోని బాబ్జి, ఎంఎల్ఓ రాజు, మహేష్, లోవ కుమారి, రామరాజ్యం పాల్గొన్నారు.

వేటగాళ్ల చేతిలో అడవి గేదె మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : నెలలు గడవక ముందే మారేడుమిల్లి మండలంలో వేటగాళ్ల చేతిలో మరో అడవి దున్న బలైంది. మారేడుమిల్లి-రంపచోడవరం ప్రధాన రహదారి స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమీపంలో ఉన్న టేక్ ప్లాంటేషన్లో కొంతమంది వేటగాళ్లు అమర్చిన కరెంటు ఉచ్చులో పడి భారీ అడవి దున్న ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతి చెందిన అడవి దున్నను కోసి సగభాగంపైగా వేటగాళ్లు గుట్ట చప్పుడు కాకుండా తరలించారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది చాకచక్యంగా వ్యవహించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పలుచోట్ల ఇప్పటివరకు నాలుగు అడవి దున్నలు మృతి చెందగా, కనిపించ కుండా ఎన్నో అడవి జంతువులు మృతి చెందాయి. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు వాటిని రక్షించే ప్రయత్నంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత వల్లే పర్యవేక్షణ చేయలేకపోతున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అడవి గేదె మృతిపై సోమవారం డివిజనల్ ఫారెస్ట్ రేంజ్ అధికారిని వివరణ కోరగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, దీనిపై దర్యాప్తు చేపడుతున్నామని, పూర్తి సమాచారం త్వరలో వెల్లడిస్తామని చెప్పారు

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవం పోస్టర్ను జిల్లాలో వున్న వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సోమవారం అల్లూరి సీతారామరాజు భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల కోసం జరుగుతున్న పెద్ద పండగ అని తెలిపారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టెంపాడు గ్రామ పంచాయితీ పరిధి గోపవరం గ్రామానికి చెందిన సెగ్గే రమణబాబు ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి వైయస్సార్ ప్రమాద బీమా కింద రూ.5లక్షలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును రమణబాబు కుటుంబానికి జెడ్పిటిసి వారా నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, స్థానిక సర్పంచ్ నేమాని నూకలమ్మ, చేతులు మీదగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో చిట్టెంపాడు సచివాలయ కన్వీనర్ పెట్ల గాంధీ, వైసిపి నాయకులు ఉల్లి రామ్మూర్తి, పాడి కిరణ్ బాబు, అనిల్, ఆర్టీసీ కండక్టర్ విజయలక్ష్మి, చిట్టెంపాడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

తుపాన్కు కుంగిపోయిన కల్వర్టు

ప్రజాశక్తి-కొయ్యూరు : మిచౌంగ్ తుఫాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి గరిమండ - గొర్రెలమెట్ట గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా కృంగిపోయి ప్రమాదకరంగా మారింది. రహదారికి సగం వరకూ కొట్టుకుపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని బూదరాళ్ల సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ కోరారు.

నాగలింగేశ్వర ఆలయంలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి -అడ్డతీగల : మండల కేంద్రంలోని పార్వతి నాగలింగేశ్వర ఆలయంలో చివరి కార్తీక సోమవారం సందర్భంగా గ్రామస్తుల సహకారంతో నాగలింగేశ్వర స్వామి కమిటీ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సామిదాల శ్రీనివాస్, రాజా రమేష్, పోరాపు రాంబాబు, కీలు వెంకటేశ్వరరావు, చక్రధర్, దుర్గారావు, పులిదిండి బుజ్జి, ప్రకాష్ టైలర్, ఎడ్ల వాసు, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి, మల్లుదొర విగ్రహాల ప్రతిష్టకు భూమి పూజ

ప్రజాశక్తి-కొయ్యూరు : కాకరపాడు సెంటర్లో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3 సెంట్లు స్థలంలో స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొరల విగ్రహాలను ప్రతిష్ఠించడానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం

డంపింగ్ యార్డ్ను తలపిస్తున్న క్రీడా మైదానం

ప్రజాశక్తి-రంపచోడవరం : క్రీడలకు, పలు సమావేశాలకు వేదికగా ఉండే రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం మురికి కూపంలా మారిందని, డంపింగ్ యార్డును తలపిస్తోంది. కళాశాల క్రీడామైదానంలోని ఎర్రంరెడ్డి నగర్ వైపు ఉన్న ప్రహరీ గోడ ధ్వంసం కావడంతో చుట్టుపక్కల నివసించేవారు కళాశాల క్రీడామైదానంలోనే వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డ్లా మారి దుర్వాసన వస్తోంది. దీంతో మైదానంలో ఉదయం, సాయంత్రం సమయాలలో వాకింగ్ చేసే వారు, వివిధ రకాల క్రీడలు ఆడే క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి మైదానంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

23 హెక్టార్లలో పంట నష్టం

ప్రజాశక్తి- కొయ్యూరు : మిచౌంగ్ తుపాన్ కారణంగా కొయ్యూరు మండలంలో 23 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి తెలిపారు. మండలంలోని చీడిపాలెం రైతు భరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయ సలహా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత గ్రామాలలో వరి పొలాలపై తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 5 ప్రకారం వరి చేను నీటిలో మునిగి ధాన్యం మొత్తంగా కుళ్ళినట్లయితే నష్టపరిహారం వస్తుందని తెలిపారు. కోత కోసి పనలకు జరిగిన నష్టానికి ఎటువంటి పరిహారం లభించదని స్పష్టం చేశారు. సోమవారం నుంచి వరి పంట పోయిన జాబితాను గ్రామస్థాయిలో వ్యవసాయ సిబ్బంది తయారు చేస్తారన్నారు. చాలా పొలాల్లో రైతులు పడిపోయిన వరి పొలాలను నిలబెట్టుకున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎవరైతే నష్టపరిహారానికి అర్హులో వారి జాబితాను తయారు చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత గ్రామ సచివాలయాల సిబ్బందిపై ఉందని రంపచోడవరం ఎంపీడీవో హరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో 8 గ్రామ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లకు ప్రభుత్వ పథకాలు అమలు, గ్రామ సచివాలయాల విధి విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి గ్రామ సచివాలయాల పరిధిలోనూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న సచివాలయాల విధి విధానాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామ సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తుప్పలు తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి దుర్జో మాట్లాడుతూ సీలేరు మేజర్ పంచాయతీ పరిధి దుర్గా వీధి, పోలీస్ స్టేషన్ వెనుక శివాలయం పరిసర ప్రాంతాల్లో కూలీలను పెట్టి తుప్పలు తొలగించడానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి ఏడాది జంగిల్ క్లియరెన్స్ చేపడతామని, ఇందులో భాగంగానే ఈ ఏడాది కూలీలను పెట్టి గ్రామ పరిసర ప్రదేశాల్లో తుప్పలు తొలగించే పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ పిల్ల సాంబమూర్తి, ఉప సర్పంచ్ కె.వల్లిప్రసాద్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.